క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాల తనిఖీ


కూరగాయలు పరిశీలిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలను గురువారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్ తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వంట గదిలో నిల్వ ఉన్న కూరగాయలు ఇతర పప్పు దినుసులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వారి వెంట హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి


ప్రసంగిస్తున్న లింబాజీ మహరాజ్

లింగాపూర్: భక్తులు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని గురువారం లింగాపూర్ మండల కేంద్రంతో పాటు, మోతీపటార్, కొత్తపల్లి, పిక్లా తండా, కీమానాయక్‌తండా, పూల్‌సింగ్‌తండా, రామునాయక్‌తండా గ్రామాల్లో లింబాజీ మహరాజ్ పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఆన్‌లైన్ నమోదును పరిశీలించిన ఎంపీడీవో


పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన ఇంటింటి సర్వే వివరాల ఆన్‌లైన్ డాటా ఎంట్రీని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ డాటా ఎంట్రీలో సర్వే రికార్డులు ఎలాంటి తప్పిదాలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ సర్వే ఫారంను పరిశీలించాకే ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేయాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై

దహెగాం: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై కందూరి రాజు అన్నారు. గురువారం మండలంలోని లగ్గాం ఎక్స్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్‌లు లేకుండా, వాహన ధ్రువ పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యాన్ని చేర్చాలన్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

బెజ్జూర్: మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని సలుగుపల్లి గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో తలకు గాయాలై మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గోవింద్‌పూర్ కాలనీకి చెందిన పేర లక్ష్మీనారాయణ అనే యువకుడు సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫోన్ పోగొట్టుకోగా సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ నెంబరును వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చి సెల్‌ఫోన్‌ను గుర్తించవచ్చన్నారు.

ఎస్సైకి సన్మానం

బెజ్జూర్: మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కె.ప్రవీణ్ కుమార్‌ను బెజ్జూర్ మండల ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌ను ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో తిప్పలు

- అధ్వానంగా చింతలమానెపల్లి నుంచి గూడెం మార్గం
- చింతలమానెపల్లి నుంచి ఖర్జెల్లి వరకు కొత్తగా రహదారి పనులు
- ఖర్జెల్లి నుంచి గూడెం వరకు జీపీ నిధులతో తాత్కాలిక పనులు
- బురదమయంగా మారుతున్న రోడ్డు
- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా ఉన్న చింతలమానెపల్లి -గూడెం రహదారి

చింతలమానెపల్లి: అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల అలసత్వంతో నాసిరకంగా పనులు చేపట్టడంతో ఖర్జెల్లి నుంచి గూడెం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చింతలమానెపల్లి నుంచి ఖర్జెల్లి మీదుగా గూడెం వరకు అటవీ ప్రాంతం గుండా రహదారి ఉంది. ఈ రహదారి మహారాష్ట్రలోని అహేరికి అంతర్రాష్ట్ర రహదారిగా ఉంది. గూడెం వద్ద ప్రాణహిత నదిపై వంతెన నిర్మాణంతో రాష్ట్రాలకు రవాణా సులువుగా మారింది. కానీ ఈ రహదారిపై అనుమతులు లేని కంకర తరలించే వాహనాలు భారీ లోడ్‌తో వెళ్లడంతో రహదారి అధ్వానంగా మారింది. ఖర్జెల్లి, కేతిని, చిత్తామ, దిందా, గూడెం గ్రామాలకు వెళ్లే ఈ మార్గంలో భారీ గుంతలతో ప్రయాణం నరకంలా మారింది. ఈ మార్గంలో ఉన్న గ్రామాల ప్రజలు మండల కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, జిల్లా కేంద్రాలకు చేరుకోవాలంటే నానా తిప్పలు పడుతున్నారు. విద్య, వైద్యం, ఇతర అవసరాలకు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. కానీ రహదారిపై గుంతలతో 22 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతుందంటే రోడ్డు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈమార్గంలో వెళ్లే వారికి సకాలంలో వైద్యం అందక పలువురు మృతి చెందిన ఘటనలు సైతం ఉన్నాయి.

పట్టింపు లేని అధికార యంత్రాంగం..

రహదారి అధ్వానంగా ఉన్నా.. ప్రమాదాలు జరిగినా.. ఫిర్యాదులు వచ్చినా అధికార యంత్రాంగం మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వం మారిన అనంతరం నియోజకవర్గంలో పలు మండలాలలో ఆర్‌అండ్‌బీ రహదారులకు పనులు నిర్వహించారు. మండల కేంద్రం నుంచి ఖర్జెల్లి వరకు కొత్తగా రహదారి పనులు నిర్వహించారు. కానీ ఖర్జెల్లి నుంచి గూడెం వరకు 18 కిలోమీటర్ల రహదారి పరిస్థితి మాత్రం మారలేదు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఈమార్గంలో పరిస్థితిని పరిశీలించి అధికారుల తీరుపై విమర్శలు చేశారు. అధ్వానంగా రహదారులు ఉండడంపై ప్రజల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తాత్కాలిక పనుల కోసం లక్షల రూపాయలు..

ఖర్జెల్లి నుంచి గూడెం వరకు నిర్వహించిన పనులు అధ్వానంగా ఉండడంతో పనులు జరిగిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్ జేబులు నింపుకునేందుకే పనులు నిర్వహించారని ఆరోపణలు వస్తున్నాయి. అంతర్రాష్ట్ర రహదారిపై శాశ్వత పనులకు బదులు మట్టితో పనులు నిర్వహించడం సరికాదని ప్రజలు విమర్శిస్తున్నారు. పనులు నాసిరరంగా నిర్వహించడంపై బీజేపీ సీనియర్ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రభాకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈని సంప్రదించగా ఈ పనులను తాత్కాలికంగా నిర్వహించామన్నారు. నాసిరకంగా పనుల నిర్వహణపై మాట్లాడుతూ నాసిరకంగా చేసిన వాళ్లను పనుల గురించి అడగాలని తమకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారు.

అక్రమార్జన కోసమేనా..?

ఖర్జెల్లి నుంచి గూడెం వరకు రహదారి పనులు చేపట్టకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఈమార్గంలో పంచాయతీ నిధులను వినియోగించి తాత్కాలిక పనులు నిర్వహించడానికి ప్రతిపాదనలు పంపించారు. కౌటాల, చింతలమానెపల్లి మండలాలలో పలు పనులకు మొత్తంగా రూ. 26 లక్షల నిధులు మంజూరు కాగా ఈనిధులలో భాగంగా రహదారిపై పనులు నిర్వహించారు. కాగా ఈపనులు నాసిరకంగా నిర్వహించడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఖర్జెల్లి నుంచి గూడెం మార్గం అంతర్రాష్ట్ర మార్గం కాగా ఈమార్గంలో గుంతల్లో మట్టి పనుల కారణంగా వాహనాలు కూరుకుపోయాయి. మొరానికి బదులు నాసిరకం మట్టి వేయడంతో బురదగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కురిసినా, భారీ వాహనాలు ప్రయాణించినా రహదారులు మరింత అధ్వానంగా మారే పరిస్థితులు ఉన్నాయి.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కౌటాల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కళ్యాణి అన్నారు. గురువారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు. చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం అవుతాయని, ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సంస్కృతిక నృత్యం ఆకట్టుకున్నాయి. కౌటాల ఎస్సై ఎన్. మధుకర్, ఆసిఫాబాద్, కౌటాల కళాశాల ప్రిన్సిపాల్స్ రాందాస్, బాలకిషన్‌రావు, అధ్యాపకులు రజిత, సమత, భాగ్యలక్ష్మి, సుజాత, శ్రీవాణి, అశోక్, ఆంజనేయులు, శ్రీనివాస్, మోతిలాల్, ప్రకాశ్, రాందాస్, రాంబాబు, పాపయ్య పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో సీసీఐ జోరు

- గతం కంటే ఎక్కువ కొనుగోళ్లు


మాట్లాడుతున్న చైర్మన్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో ఇప్పటివరకు పత్తి కొనుగోళ్లలో సీసీఐ అగ్రస్థానంలో నిలిచింది. మార్కెట్ పరిధిలోని ఆరు సీసీఐ కేంద్రాల్లో 1,10,279 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ప్రైవేట్ వ్యాపారస్తులు కేవలం 10,777 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. గత ఏడాది సమాయానికి సీసీఐ కేవలం 1716 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారస్తులు 13,667 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. గత ఏడాది ఈ సమయానికి 15,383 క్వింటాళ్ల పత్తిని సీసీఐ, ప్రైవేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేయగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 1,21,056 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కాగా.. ఈనెల 22 వరకు పత్తి విక్రయించిన వారి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. ఈనెల 27 వరకు బోథ్, నేరడిగొండ మండలాల్లో 2143 మంది రైతుల నుంచి 35,760 క్వింటాళ్ల సోయాపంటను పీఏసీఎస్ ద్వారా మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

రేపు రైతు పండుగ వేడుకలు


మాట్లాడుతున్న మార్కెటింగ్ ఏడీ గజానంద్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలోని అమిస్తాపూర్‌లో రైతు పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని మార్కెటింగ్ ఏడీ గజానంద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెటింగ్ మాట్లాడారు. అక్కడ వ్యవసాయ ప్రదర్శనలు, రైతు పండుగ మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లెల అభివృద్ధి


గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న గంగారెడ్డి

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో రూ. 4 లక్షలతో నిర్మించే గ్రావెల్ రోడ్డు పనులను బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు తీసుకువస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల రమేశ్, టౌన్ ప్రెసిడెంట్ అనిల్, అంకుష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలి

నేరడిగొండ: జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుజరాత్ తరహాలో అంగన్‌వాడీలను 3, 4 నాలుగు తరగతి ఉద్యోగులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించాలని పేర్కొన్నారు. అంతవరకు టీచర్లకు గౌరవ వేతనం రూ.26 వేలు, ఆయాలకు రూ.13 వేలు అందించాలన్నారు. డిసెంబర్ 9 నుంచి జరిగే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు శనిమందిర్‌లో నవగ్రహ హోమం

కాగజ్‌నగర్ రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శనిమందిర్‌లో శనివారం నవగ్రహ హోమం నిర్వహించనున్నట్లు మందిరం కార్యదర్శి, పండితులు నంద కిశోర్‌శర్మ గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి హోమ కార్యక్రమం, అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెబ్బెన: కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన గజ్జి ప్రసాద్ (30) అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది, ఈనెల 25న రెబ్బెన మండలం లోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. గురువారం మృతి చెందినట్లు రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే ప్రసాద్ గతకొన్ని సంవత్సరాలుగా అధిక మద్యానికి బానిసయ్యాడు. క్రమంలో ఈనెల 25న కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్‌కు చేరుకొని, కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలుపుకుని సేవించి కాగజ్‌నగర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో వంకులం వద్ద అపస్మారక స్థితికి చేరుకుని బైక్‌పై నుంచి కిందపడ్డాడు. వెంటనే స్థానికులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి అన్న పొతరాజుల మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సన్మానం

నార్నూర్: గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామానికి చెందిన అత్రం అరవింద్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి శిక్షణ పూర్తి చేసుకోవడంతో గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మెస్రం శేఖర్ బాబు, కుమ్రా సోనేరావు, బీర్ షావ్, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి

ఆదిలాబాద్‌టౌన్: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని న్యూ రెయిన్‌బో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రాము అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. బాల్య వివాహాలు, బేటీ బచావో.. బేటీ పఢావో, విద్యా హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుతోనే ఉన్నతస్థాయికి ఎదుగుతారని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మీనాక్షి, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల (కాగజ్‌నగర్)ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని, వంట గది, వంట సామగ్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సరుకులను పరిశీలించి నాణ్యమైనవి వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

జ్యోతిబా పూలేకు ఘన నివాళి


వాంకిడి: నివాళులర్పిస్తున్న నాయకులు


రెబ్బెన: నివాళులర్పిస్తున్న నాయకులు


కౌటాల: నినాదాలు చేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గురువారం బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్, కడ్తల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, రాయిల్ల నర్సయ్య, సాగర్‌గౌడ్, స్వామి, రాయమల్లు, భరత్ పాల్గొన్నారు.

కౌటాల: జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని ముత్తంపేట్, నాగేపల్లి, కన్నెపల్లి, గురుడుపేట, బోదంపల్లి గ్రామాల్లో నివాళులర్పించారు. నాయకులు నికాడే గంగారం, మోర్లె రమేశ్, ఆదే శ్రీనివాస్, వాసకే నిహారిక, బండి రాజేందర్ గౌడ్, నాందేవ్, ముక్తేశ్వర్, మోర్లె పాండురంగ్, చందు, నగేశ్, సురేశ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని గురువారం మండలంలోని మాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూలే జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్వర్ సెండె, లెండుగురె భీంరావ్, గుర్నులే శ్యాంజీ, పోశం, చౌదరి తిరుపతి, వడాయి రవి, గుర్నులే గుణవంత్‌రావ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో జ్యోతిబా పూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషి ఎనలేనిదని, ఆయన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గుర్నులె నారాయణ, వడై బాబురావు, అశోక్ మహోల్కర్, విలాస్ ఖోబ్రగడె పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఇటీవల వాంకిడి ఆశ్రమ విద్యార్థిని శైలజ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో గురువారం జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. మాలీ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటాన్ని నివాళులర్పించారు. జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జ్యోతిబా పూలే వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి వెనుకబడిన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో కొట్నాక్ విజయ్, సొల్లు లక్ష్మి, అరిగెల మల్లికార్జున్, సుంకరి పెంటు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు అందేలా చూడాలి


మొక్క అందజేస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ ద్వారా నాణ్యమైన బొగ్గు వినియోగదారుడికి అందేలా చూడాలని (క్వాలిటీ) సుశాంత సాహా అన్నారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన ఆయన ఏరియాలోని కైరిగూడ ఓసీపీతో పాటు గోలేటి సీహెచ్‌పీని సందర్శించారు. బొగ్గు నాణ్యతపై సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. సంస్థపై ఎంతో నమ్మకంతో వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేస్తున్నారని అన్నారు. వారి నమ్మకాన్ని కోల్పోకుండా నాణ్యమైన బొగ్గును అందించేందుకు సంస్థలో పనిచేసే ప్రతీ ఉద్యోగి కృషి చేయాలన్నారు. వినియోగదారుడికి సరఫరా చేసే బొగ్గులో సేల్, బండరాళ్లు లేకుండా చూసుకోవాలన్నారు. సకాలంలో వినియోగదారులకు బొగ్గును అందచేసి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్, అధికారులతో కలిసి క్వాలిటీ జీఎంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, క్వాలిటీ ఇన్‌చార్జి గుమాస రవి పాల్గొన్నారు.

జీరో ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యార్థులందరూ జీరో ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ దుర్గం సామ్రాట్ సూచించారు. గురువారం మండలంలోని తుంపల్లి ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చిర్రకుంట ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. కళాకారులతో పాటల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పొదుపు చేయడంతో భవిష్యత్‌లో అత్యవసర సమయాల్లో సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సాయి, కళాకారులు రమేశ్, నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్‌రావ్ పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'


మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: రాష్ట్ర మంత్రి సీతక్క రాజీనామా చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ కొలవార్ సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు అన్నారు. గురువారం కౌటాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న గిరిజన మహిళా మంత్రిపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కనపడటం లేదని విమర్శించారు. సమావేశంలో సంఘం నాయకులు కుర్మ రాజు, నగేశ్, గోపాల్, కార్తీకర్, రాజన్న, తిరుపతి, రవీందర్‌గౌడ్, అజ్మత్ అలీ పాల్గొన్నారు.